# రిక్షావాడు

శ్రీమతి రుక్మిణీ గోపాల్

ఇప్పుడే ఆలిండియా రేడియో స్టేషను భవనంనుంచి బైటకు వచ్చాను. ఎండ తీక్షణంగా ఉంది. మే నెల. మధ్యాహ్నం ఒంటిగంటన్నరయింది. పూర్తిగా కళ్లు విప్పి పైకి చూడలేనంత దారుణంగావుంది ఎండ. ఇంత ఎండలో నడవటం కష్టమని ఒక రిక్షా కట్టించుకుని మరీ పోదామనుకున్నాను. హాండ్ బాగ్ తీసి చూసుకున్నా. కొన్ని చిల్లరడబ్బులు, ఒక 15 రూపాయల చెక్కు చేతికి తగిలాయి. అది, ఆలిండియా రేడియోవారు నా పేర వ్రాసియిచ్చింది. ఆ చెక్కును బయటికి తీసి ఒకసారి చూసుకున్నా. దానిని చూడగానే ఒక విధమైన సంతృప్తితో నా మనసు నిండింది. మళ్ళీ ఇంకొకసారి దానిని తృప్తిగా చూసి హాండ్ బాగ్ లో పెట్టుకున్నాను. అది నా కష్టానికి ఫలం అనుకున్నా. కాని నిజానికి నేనేం కష్టపడ్డాను? 15 నిముషాలుపట్టే ఒక నాటికలో 4, 5 వాక్యాలు మాట్లాడాను. అంతేనా! పోనీలే, ఏదైతేనేం. 15 రూపాయలు నా చేతికొచ్చాయి. అంతే చాలు. ఇలా ఆలోచించుకుంటూ అటూ ఇటూ చూశాను. అప్పుడే ఒక ఖాళీ రిక్షా అటునుంచి వస్తోంది. చెయ్యూపాను. రిక్షా దగ్గరకొచ్చి ఆగింది.

ఆ రిక్షా లాగేవాడికి సుమారు 60 సంవత్సరాలుంటాయి. ఒళ్ళూ, ముఖం బాగా ముడతలుపడిపోయి ఉన్నాయి. నరాలు కనపడుతూ, బక్కగా ఉన్నాడు. కాళ్ళకు బాగా పాతబడిపోయిన చెప్పుల్ని తాళ్లతో కట్టుకున్నాడు. వాడు తొడుక్కున్న చొక్కా, వెనక ఒక ప్రక్క సగానికిపైగా చిరిగిపోయింది. అది ఒంటి నట్టిపెట్టుకొని ఉండేందుకు ముందు భాగం ఒక్కటే ఆస్కారంగా ఉంది. ముందుభాగంలో బొత్తాలు ఏమీ లేవు. వెనకాల పూర్తిగా లేకపోవటం మూలాన్ని చొక్కా ముందుకు వేళ్లాడుతోంది. ఒక పంచె (గుడ్డ అంటే బాగుంటుంది) మోకాళ్ళపైకి కట్టుకున్నాడు. నెత్తిమీద ఒక చిరుగుటోపి. ఇదీ వాడి వాలకం.

"బస్ స్టాప్ కి పోవాలి. ఏం తీసుకుంటావు?" అని అడిగాను.

"అరణాలిప్పించండి"

"అదేవిటయ్యా అలా అడుగుతావు? ఇక్కడున్న బస్ స్టాప్ కి, ఒక్క మనిషికి అరణాలా! నేనేమన్నా కొత్తదాన్ని అనుకున్నావేమో! రోజూ వస్తూపోతూ ఉంటాను. మూడణాలు ఇస్తాను. వస్తేరా, లేకపోతే లేదు."

"ఎత్తెక్కాలమ్మా. ఎండలో నడవాలి. అయిదణా లిప్పించండి."

"బాగుంది. ఎండలో నడవకపోతే డబ్బు లెట్లా వస్తాయి? ఆఖరుమాట పావలా ఇస్తాను. వస్తావా?"

"మీ దయ. కట్టంసూశారు కారు. ఎక్కండి."

రిక్షాలో ఎక్కి కూర్చున్నాను రిక్షా నడుస్తోంది. వాడు మొదట గబగబా పరుగెడదామని ప్రయత్నించాడు. కాని నాలుగడుగులు వేసేటప్పటికి ఆయాసం వచ్చి నెమ్మదిగా నడవటం ప్రారంభించాడు. ఒంటినిండా చెమటలు కారుతున్నాయి.

"అయితే అక్కడేంసేత్తారు అమ్మాయిగోరూ? రోజూ శానామంది వచ్చిపోతుండారు. మీరు పదవాడేరా?" అన్నాడు.

"లేదు. నాకు పాటపాడటం చేతకాదు. ఒక నాటకంలో మాట్లాడాను. అక్కడ రోజూ నాటకాలు, పాటలు, గానసభలు, హరికథలు, అన్నీ జరుగుతుంటాయి."

"అయితే నాకు తెలకడుగుతాను. అయన్నీ రోజూ ఎందుకేత్తారండి? రోజూ ఇనటానికి ఎవరికి తీరుద్ది?"

వాడి అమాయకత్వానికి నాకు నవ్వొచ్చింది. "ఎందుకు తీరుబడి ఉండదు? రోజూ కావలసినంతమంది విని ఆనందిస్తారు" అన్నాను.

"మరి గత్తే ఈ టన్నింటికి డబ్బుండాలి గదా! అదెవరిత్తారంట?"

"వాళ్లు చాలా డబ్బున్నవాళ్ళులే." అన్నా వాడింక ఏమిచెప్పినా గ్రహించుకోలేడని.

"అట్టానా, అయితే సెప్పినందుకు ఆళ్లు మీకుకూడా డబ్బిత్తారా?"

"ఆ, ఇస్తారు. ఇవాళ నేను ఒక నాటకంలో నాలుగయిదు మాటలు మాట్లాడాను. 15 రూపాయలు ఇచ్చారు" అన్నాను కొంచెం గర్వంగా.

"అయ్య బాబోయ్, పదిహేను రూపాయలే! నాలుగయిదు మాటలకి అంతెందుకిచ్చారు? ఆళ్ళు ఎర్రోళ్ళలాగున్నారే! మాకు ఇంతెండలో, వానలో రోజల్లా కట్టపడ్డా, దినానికి రొండు రూపాయలొత్తానికి బెమ్మాండమవుద్ది. అయితే అమ్మాయిగోరూ, మా బోటోళ్లు కూడా అక్కడ మాటాడొచ్చా?"

"నువ్వేం మాట్లాడగలవు?" అన్నాను వాడి తెలివితక్కువతనానికి నవ్వుకొని.

"మీరెట్టా మాటాడారు? ఆరు సెప్పిందే మీరన్నారా? మీ కిట్టవయింది మీరు సెప్పారా?"

"నేనుమాత్రం వాళ్లు చెప్పిందే మాట్లాడాను. కొందరు వాళ్ళ కిష్టమైంది కూడ చెప్తారు. ఒకవేళ నిన్ను నాటకంలోకి పిలుస్తారనుకో. నువ్వు మాట్లాడగలవా?" అన్నాను తమాషాగా.

"అంత అదృష్టవా అమ్మా, ముసలితనంలో ఈ రిచ్చా నాగనేక నాపాణాలు పోతుండయి. రొంతుమైళ్ళు లాగినా అర్ధరూపాయి డబ్బులు ఏ అయ్యా ఇయ్యరు. అక్కడ ఎంచక్కా రొండు మూడు మాటలు మాటాడితే పదేనురూపాయలొత్తాయి. ఎంత సుకం! కాని మా కరమం అమ్మా. మీరయితే సదువుకున్నా మారాజులు కామట్టి ఆరేటిసెప్తే అదిఅనగలరు. మా కెట్టా సేతనవుద్ది?"

"నీ కింట్లో పిల్లలెవరూ లేరా? ఇంత ముసిలాడివి నువ్వెందుకింకా కష్టపడతావు?"

"ఒ కొడుకున్నాడమ్మా. ఆడి కప్పుడే ఇద్దరు పిల్లలు, పెళ్ళావూ. ఆడి సంపాదన ఆడికే సాలదు. నాకేం పెడతాడు? మా ముసిల్ది మంచంమీంచి సెగనేదు. ఖాయిలా మడిసి. ఇక నే కట్టపడకండా ఎట్టా జరుగుద్ది?"

"నీకొడుకు నీ మనవలకి చదువు చెప్పిస్తున్నాడా?"

"అమ్మాయిగోరూ, పిల్లా, పెద్దా ఇంటిల్లపాదీ దినాం కట్టపడితే ఒక్కపూటైనా కడుపునిండా తినేందుకు సాలదు. ఇక సదువు లెట్టాగొత్తాయి? పాత్తకాలూ అటికీ డబ్బుండాలి గదా!"

ఎండ చాలాతీక్షణంగా ఉంది. రిక్షాలో కూచున్నా తల

నొప్పి [illegible]ంది. కబుర్ల సందడిలో వాడు పరుగు మానేసి నెమ్మదిగా నడవటం మొదలెట్టాడు. అయినా వాడి ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్ద యింది. మధ్యమధ్య కొంచెం రొజుతున్నాడు. ఇంతలో బస్‌కి టైమ్ అయిపో యిందని జ్ఞాపకం వచ్చింది. ఇంకా చాలా దూరం పోవాలి. ఆ బస్ దాటిపోతే అక్కడే ఎండలో బడి గంటకూర్చోవాలి. ఎవడు కూర్చుంటాడు! వాడిని కొంచెం తొందర పెట్టాను. వాడు మళ్ళీ కొద్దిగా పరుగు ప్రారంభించాడు.



బస్ స్టాప్ దగ్గరకు వచ్చేసింది. ఇంటికి ఏమైనా పళ్ళు కొనుక్కుని పోదామని, అక్కడే ఒక పళ్ళదుకాణం ఉంటే రిక్షా ఆపమన్నాను. నేనుదిగి పళ్ళు బేరం చేస్తున్నాను. వాడు నేను కొంటున్న పళ్ళవంక ఆశగా చూస్తూ నిలబడ్డాడు.

ఒక రూపాయి పళ్లు కొని వచ్చి రిక్షాలో కూర్చున్నా. ఇంతలోనే ఎక్కడనుంచివచ్చాడో, ఒక ఎర్రటోపీ ప్రత్యక్షమైంది. "ఏయ్ నడిరోడ్డుమీద రిక్షా ఆపకూడదని తెలీదూ? నీ పేరేమిటి?" అన్నాడు జేబులోంచి నోట్ బుక్, పెన్సిల్ తీసుకుంటూ.

రిక్షావాలాఒక సలాంకొట్టి, బెదురుచూపులు చూస్తూ "ఇప్పుడే ఈరు పళ్లుకొంటానికి దిగేరు బాబూ, ఈపాలికి చెమించండి." అన్నాడు.

"క్షమించటంలేదు, గిమించటంలేదు. రోడ్డుకు అడ్డంగా పెడితే వచ్చేపోయేవాటికి అడ్డమని తెలీదు?"

"రోడ్డుకు పక్కగానే పెట్టాను బాబూ. బుద్ధి గడ్డితింది. ఇంకెప్పుడూ ఇట్టాంటిపని సెయ్యను."

"ఏయ్ అదంతా పనికిరాదు. అందరూ ఇలాగే అంటారు. ముందు నీపేరు చెప్పు" అన్నాడు కరుగ్గా. రిక్షావాలా బరువుగా పేరు, అదీ చెప్పాడు. పోలీసు వ్రాసుకుని "రేపు ఉదయం పది గంటలకు స్టేషన్కి వచ్చి కనపడు" అంటూ దర్జాగా వెళ్ళిపోయాడు.

రిక్షావాలా నావంక జాలిగా చూశాడు. నాకు వాడిమీద చాలా జాలివేసింది. నేను ఈరోజు ఏమి కష్టపడకుండా నే 15 రూపాయలు కళ్ళజూశాను. వాడు రోజంతా ఎండలో పడి కష్టపడ్డా రెండు రూపా

(47-వ పేజీ చూడండి)

స్తోంది. ఇది చాలదన్నట్లు ఈమధ్య పత్రికల్లో కొన్ని వార్తలు చూస్తుంటే కోపానికి కోపం, నిస్సహాయతా అధికమౌతున్నాయి. మచ్చుకి ఈవార్త చూడవచ్చు.

బొంబాయి జూన్ 2: కచ్చా వెండి మార్కెట్‌లోకి దండిగా (దాదాపు 40 బార్‌లని అంచనా) వచ్చినప్పటికీ, ఈ పూట బులియన్ మార్కెట్ కొంచెం హుషారుగానే వుంది. దీనికి కారణం ఏం చెప్పకుంటున్నారంటే కొరియన్ శాంతిరాయబారాలను గురించి ఐక్యరాజ్యసమితి కార్యదర్శిగారు పెదవి విరిచేసినందువల్లనూ, మరణసుంకాల శాసనాన్ని ఇహ పాస్ చేసెయ్యవచ్చునని గాడ్గిల్ గారు నివేదించినందువల్లనూ స్పెక్యులేషన్‌దార్లు కొనుబడిని జోరుచేశారట.


# అతిమూత్రవ్యాధి వారంరోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కరపోవట, అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్‌మలిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ అధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయబపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

60 బిళ్లల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు
ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రీసెర్చి లేబరేటరీ,
పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)


వర్తకులకి హుషారైతే వాడకపుదార్లకి ప్రాణసంకటం. ★

# రిక్షావాడు

(5-వ పేజీ తరువాయి)

యలు వస్తాయో, రావో, వచ్చినా ఇప్పుడు ఏ అర్ధరూపాయో ఫైన్‌కింద పోతుంది. ఇందులో తనేం తింటాడు, ఆ రోగిష్టి పెళ్ళానికి ఏం పెడతాడు? నాకివాళ వచ్చిన చెక్‌కి నేను తగుదునా అనిపించింది. నేనేం కష్టపడ్డానని ఆ డబ్బు తీసుకోవాలి? ఆ డబ్బుమీద నాకేం హక్కు లేదనిపించింది. నిజంగా నేను ఆ డబ్బు తీసుకుంటే దుర్వినియోగం అవుతుంది. ఆ చెక్కు వాడి కిచ్చేద్దామా అనిపించింది. హాండ్ బాగ్‌లోకి చెయ్యిపోనిచ్చాను. కాని ఏదో నాకు తెలియని నాలోని ఒక శక్తి నన్నా పని చెయ్యనియ్యలేదు. అదే సమయానికి ఈ పదిహేను రూపాయలు పెట్టి నేను కొనుక్కుందా మనుకొన్న నినాన్ సిల్కుచీర జ్ఞాపకం వచ్చింది. నా క్లాస్ మేట్ రమ, నిన్ననే ఆ చీర కట్టుకొని కాలేజీకి వచ్చింది. ఆ లేతపసుపు పచ్చని రంగుమీద సన్నని వైలెట్ రంగు నన్నెక్కువగా ఆకర్షించింది. ఆ చీర మెరుపు నా హృదయంలో ఒకసారి తళుక్కుమంది. నా భావాలు మారిపోయాయి. పట్టిచెయ్యినే బైటికి తీశాను. పోనిద్దూ, ఇప్పుడు ఈ 15 రూపాయలు వాడి కిచ్చినంత మాత్రాన వాడి దరిద్రం ఎలాగూ తీరిపోదు. అయినా మనం ఒక్కరికి సాయం చెయ్యటంతో ఏమైంది? దేశమంతా ఇలాగే తగులడుతోంది. దీనికి గవర్నమెంటే పూనుకోవాలిగాని మనవల్ల ఏమౌతుంది? ఒకళ్ళా ఇద్దరా? ఎంతమందికని సాయం చెయ్యటం? నేను ఈ ఒక్కడికి సాయంచేసినంత మాత్రాన దేశం బాగుపడదు. అందరూ, అందరికీ సాయం చెయ్యాలి. అలా ఒక్కనాటికీ చెయ్యరు. ఇక నా ఒక్కదానివల్లా ఏమవుతుంది, అనవసరంగా నేను నష్టపడటం తప్ప విడిస్తే. ఇలాంటి భావాలు నాలో దొర్లసాగాయి.

బస్ స్టాప్ వచ్చేసింది. నేను రిక్షా దిగి బాగ్‌లోంచి ఒక పావలా తీసి వాడి చేతిలో పెట్టాను. "అమ్మగోరూ, మసిలోణ్ణి. ఎండలో కష్టపడ్డాను." అన్నాడు ఇంకా చెయ్యి జాపి. ఇంకొక అణా తీసి వాడి చేతిలో పెట్టి, నా దాతృత్వానికి నన్ను నేనే మెచ్చుకుంటూ వచ్చేశాను. ★

## రచయితలకు మనవి

రచయితలు తమ రచనలను సిరాతో కాగితానికి ఒకే వైపున వ్రాసి పంపవలెనని మనవి. తమ రచనలను త్రిప్పి పంపగోరువారు, మూడు కాన్ల స్టాంపులను రచనలతోనే చేర్చి పంపవలెనని కోరుతున్నాము. అలా స్టాంపులను రచనలతో చేర్చి పంపనిచో త్రిప్పిపంపుట సాధ్యముకాదు.

కొంతమంది తమ రచనలను ఏ కారణములవల్ల ప్రచురించలేదో ప్రశ్నిస్తూ లేఖలు వ్రాస్తున్నారు. అట్టి కారణాలను వివరించుట సాధ్యముకాదని రచయితలు గుర్తింపవలెనని ప్రార్థిస్తున్నాము.

—సంపాదకుడు.


## కాంచనద్వీపం

రాబర్ట్ లూయీ స్టీవెన్సన్
అనువాదం: నండూరి రామమోహన రావు
ఆంధ్ర గ్రంథమాల,